క్లుప్తంగా

రణభేరి పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రాంబాబు

దెందులూరు: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19 వరకు నిర్వహించే రణభేరి కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం గుడివాకలంక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరు రాంబాబు విడుదల చేశారు. ఉపాధ్యాయులపై ప్రభుత్వ అధినేతలు మాటల్లో కనిపించే ప్రేమ చేతల్లో కనిపించడం లేదని రాంబాబు ఆరోపించారు. 12వ పీఆర్సీ కమిషనర్ రాజీనామా చేసి 15 నెలలు గడిచిన మరొకరిని నియమించలేదని తెలిపారు. ఈ కాలంలో ఒక బాఏ కూడా ఇవ్వలేదన్నారు. సీపీఎస్‌గా మార్చేందుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో నిర్వహించే రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సాల్మన్, రవి, ప్రసాద్, దేవి ప్రసాద్, జనార్దన్‌రావు, దాసు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఏలూరు (టూటౌన్): విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం సందర్భంగా ఊరూరా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి చౌదరి తెలిపారు. స్థానిక పడమర వీధిలోని విశ్వకర్మ ఆలయంలో సృష్టికర్త విశ్వకర్మ వైభవం కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. గారపాటి చౌదరి, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

13 నుంచి సత్యసాయి శతవర్ష బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతవర్ష బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి సేవాసమితిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బ్రహ్మోత్సవాలు నవంబరు 13 నుంచి 23 వరకు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా శతవర్ష బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. సమావేశంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో'పై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): గంజాయి వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు అన్నారు. మంగళవారం స్థానిక రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం పోలీస్, ఈగల్ టీం సభ్యులు నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తతో ఉండి సరైన మార్గంలో జీవన శైలి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గంజాయిని, మత్తు పదార్థాలు సేవించినా, లేదా అమ్మకాలు చేసినా టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఈగల్ ఆర్ఎస్ఐ బి.ఉదయభాస్కర్, విద్యార్థులు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దంచి కొట్టిన వాన



ఏలూరు నగరంలో మంగళవారం ఉదయం 9.45 గంటల నుంచి 11 గంటల వరకు ఏకదాటిగా వర్షం దంచి కొట్టింది. జనజీవనం స్తంభించింది. విద్యార్థులు, ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. వీధులన్నీ జలమయమయ్యాయి. మురుగు డ్రెయిన్లు పొంగి పొర్లాయి. పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరింది. అండర్ పాస్ వంతెనల్లోకి పెద్ద ఎత్తున వర్షం నీరు చేరాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఆవరణల్లోకి వర్షం నీరు చేరింది. వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్ ప్రాంతాల్లోని రోడ్లన్నీ వర్షం నీటితో దర్శనమిచ్చాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు వర్షంలో తడిసి ముద్దయ్యారు. వర్షంలో ప్రజలు అవస్థలు పడ్డ దృశ్యాలివీ.

–ఏలూరు (టూటౌన్)







ఏలూరు నగరంలో వర్షంలో తడుస్తూ...



బైక్‌పై వెళుతూ..



ట్రాక్టర్‌పై వెళుతూ..



వర్షంలో తడుస్తూ రాకపోకలు

కోమటిలంక వాసులకు పడవ గండం

- బ్రిడ్జి లేక రాకపోకలకు ఇబ్బందులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.6 కోట్లు మంజూరు
- అడ్డంకిగా మారిన అటవీశాఖ అనుమతి



కోమటిలంక గ్రామం చుట్టూ ఉన్న పరిస్థితి



బయటకు రావాలంటే పడవ ప్రయాణమే

దెందులూరు: కోమటిలంక గ్రామ ప్రజలు ఏ అవసరానికయినా బయటకు రావాలంటే కోమటిలంక మురుగు వాగు దాటిల్సిందే. ఈ వాగుకు బ్రిడ్జి లేకపోవడంతో వరద ప్రవాహంలో రేకుల పడవపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తుంది. ఇది దాదాపు 1200 మంది ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామంలో ప్రతిరోజు అనుభవిస్తున్న దుర్భర జీవన విధానం. ఏలూరు నుంచి 35 కిలో మీటర్ల దూరంలో ఉన్న మైనర్ పంచాయతీ కోమటిలంక గ్రామం. ఈ గ్రామంలో దాదాపు 200 మంది పాఠశాల, కళాశాలల విద్యార్థులు చదువుల నిమిత్తం నిత్యం పడవలో రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం వస్తే వరద ప్రవాహానికి పడవ అడ్డం తిరిగితే ఇబ్బంది అవుతుందని విద్యార్థులు గ్రామంలోనే ఉండిపోతున్నారు. వైద్యం నిమిత్తం ఎవరైనా గ్రామం దాటి వచ్చేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నాటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆటపాక నుంచి కోమటిలంక వరకు బ్రిడ్జి నిర్మాణానికి దాదాపు రూ.6 కోట్లు నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి మంజూరు చేయించారు. కోమటిలంక గ్రామం అభయారణ్య ప్రాంతంలో ఉండటంతో బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ అనుమతి రాలేదు. ఏలూరు బుడమేరు ప్రాంతాల నుంచి వచ్చే వరద, మురుగునీరు ప్రవాహం కోమటిలంక ప్రజలకు శాపంగా మారింది.

వేధిస్తున్న సమస్యలు

గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం శ్లాబు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో అద్దె ఇంట్లో గ్రామ సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. దశాబ్దాలు కిందట వేసిన విద్యుత్ స్తంభాలు, తీగలు కాలం చెల్లటంతో అవి ప్రమాదకరంగా మారాయి. గ్రామం చుట్టూ చెరువులే కావడంతో సురక్షితమైన తాగునీటి కోసం గుడివాకలంక నుంచి యాగనిమిల్లి, కోమటిలంక వరకు పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. పెదయాగనమిల్లి వరకు మాత్రమే నీరు వస్తుంది. కోమటిలంక గ్రామానికి నీరు రాకపోవడంతో గ్రామస్తులు తాగునీటికి కటకటలాడుతున్నారు.

సమస్యలను వివరించాం



కోమటిలంకలో తాగునీరు, బడి, విద్యుత్ వైర్లు ప్రధానంగా బ్రిడ్జి నిర్మాణం వంటి సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎంపీ పుట్ట మహేష్ యాదవుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

– ఘంటసాల దమయంతి, ఇన్‌చార్జి సర్పంచ్, కోమటిలంక

ప్రయాణం భయంకరం



ప్రతిరోజూ పడవలో ప్రయాణం చేయడం భయంగా ఉంది. వర్షం వస్తే పడవ ప్రయాణం చేయడానికి అమ్మనాన్న ఒప్పుకోవట్లేదు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న రోజు ఇంటికే పరిమితం అవుతున్నాం. స్కూల్‌కి వెళ్లడంలేదు.

– శశిధర్, 5వ తరగతి విద్యార్థి

తాగునీటి సౌకర్యం కల్పించాలి



కోమటిలంక గ్రామానికి సురక్షితమైన తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గ్రామంలో ప్రతి ఒక్కరికీ సురక్షితమైన తాగునీరు అందాలి. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– రాజు, గ్రామస్తుడు

తారకంకు ఘన నివాళి



తారకం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న

ఏలూరు (టూటౌన్): ప్రముఖ న్యాయవాది, రచయిత, రాజకీయ చైతన్యం గల వ్యక్తి బొజ్జ తారకం అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ కొనియాడారు. తారకం 9వ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఎస్ఆర్‌పీఎస్ అండ్ ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. తారకం చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లెం ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంతోష్ కుమార్ మాట్లాడుతూ తారకం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనతో సమాజంలో మనుషుల్ని చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అని, ఆయన రాసిన పుస్తకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని తెలిపారు. ఆయన దళిత ఉద్యమ నాయకుడే కాకుండా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. చుండూరు అభాగ్యులకు జరిగిన అన్యాయంపై హైకోర్టులో వాదించారని తెలిపారు. కార్యక్రమంలో బొల్లారపు నాగరాజు, పెరియార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సయ్యద్ సగీర్ అహ్మద్ నఖ్షబందీ సాహెబ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గం ప్రతి ముస్లింకూ అనుసరణీయమని హైదరాబాద్ జామియా నిజామియాకు చెందిన సయ్యద్ సగీర్ అహ్మద్ నఖ్షబందీ సాహెబ్ అన్నారు. నగరానికి చెందిన అహలె సున్నత్ వల్ జమాత్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంజుమన్ హాలులో నిర్వహించిన జష్నె ఈదె మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాటి వారిని ప్రేమతో ఆదరించి, సోదరభావంతో మెలగాలని ప్రవక్త సూచించారని వివరించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో పాటు పేదల అవసరాలు తీర్చే సేవకులుగా ముస్లింలు తమనుతాము తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో సుమారు 1200 మంది ముస్లింలు ప్రవక్త ప్రసాదం స్వీకరించారు. ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్, మౌలానా షేక్, ఎస్ఎం అక్బర్, రాజా అహ్మద్, సాబీర్ హుస్సేన్, గాలబ్ అలీ, అబ్దుల్ అజీజ్, అబ్దుల్ రజాక్, ఎస్‌కే ఖాజా, ఎస్‌కే మస్తాన్ భాషా, ఎస్‌కే నజీర్, ఎస్‌కే వలీ, ఎస్‌కే ఇస్మాయిల్‌లతో పాటు నగరంలోని పలు మసీదులు ఇమామ్‌లు, మౌజన్‌లు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు సీఆర్ఆర్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సీఆర్ఆర్ విద్యార్థులను అభినందిస్తున్న పాలక వర్గం

పెదపాడు : జిల్లా జూనియర్ అథ్లెట్ మీట్‌లో సీఆర్ఆర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్టు ఆ కళాశాల కరస్పాండెంట్ టాటాజీ, ప్రిన్సిపాల్ సీహెచ్ సతీష్‌బాబు తెలిపారు. ఏలూరులో సోమవారం నిర్వహించిన జూనియర్ అథ్లెట్ జిల్లా మీట్‌లో సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 18 ఏళ్లలోపు బాలురు విభాగంలో 200 మీటర్ల రన్నింగ్ పోటీలో కె.దేవకుమార్ స్వర్ణం, ఎన్ చైతన్య రజతం, 400 మీటర్ల విభాగంలో ఎన్ చైతన్య స్వర్ణం, కె.దేవకుమార్ సిల్వర్, డిస్కస్‌త్రో బి.పవన్ మణికాంత స్వర్ణం గెలుపొందారని వివరించారు. 20 ఏళ్లలోపు బాలురు విభాగం షాట్‌పుట్‌లో బిజ పవన్‌కుమార్ స్వర్ణం సాధించారని తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. వీటితోపాటు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ఎం వీరబాబు జిల్లా జట్టుకు ఎంపికయినట్టు చెప్పారు. అథ్లెట్ మీట్‌లో కళాశాలకు పతకాలు లభించడంతో పీడీ కృష్ణకాంత్‌ను అభినందించారు.

వరల్డ్ ఓజోన్ డే

ఏలూరు(ఆర్ఆర్‌పేట): ప్రపంచ ప్రాణికోటి మనుగడకు ఓజోన్‌పొర ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించామని కళాశాల రసాయనశాస్త్ర విభాగ అధ్యాపకులు కె.రమేష్ అన్నారు. మంగళవారం ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ ఓజోన్ డే కార్యక్రమం నిర్వహించారు. సర్‌సీఆర్‌రెడ్డి పీజీ కళాశాల రసాయన శాస్త్ర ప్రొఫెసర్ జి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్ల ఓజోన్ పొరకు వాటిల్లే నష్టాలు, ప్రమాదాలు, ఓజోన్ పొర రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం ఓజోన్‌పొర ప్రాముఖ్యతపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

వ్యాసరచన, డిబేట్ పోటీల్లో విజేతలు వీరే



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వారధి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో చిననింద్రకొలను హైస్కూల్ విద్యార్థులు కె.రిషిత, కె.మహిమా సువర్ణరూప, సీహెచ్ దీవెన బృందం, ముసునూరు ఏపీఆర్ స్కూల్ విద్యార్థినులు ఎం లక్ష్మి, ఎల్ అను, ఎం చాందిని బృందం, కోరుకొల్లు హైస్కూల్‌కు చెందిన ఎల్ రుక్మిణీ దేవి, ఎం ఝాన్సీ స్వరూప, జి.సౌమ్య కీర్తి బృందం, డిబేట్‌లో జంగారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఐఎం కుసుమ, ఎ.గ్రేసీ, ఏలూరు సుబ్బమ్మదేవి నగరపాలక హైస్కూల్ విద్యార్థులు వై.దివ్యశ్రీ, జి.లిఖిత, పెదపాడు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు యు.భవ్యశ్రీ, ఆర్ పావని, జె.ఎమిలీ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ప్రథమ స్థానం విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో అక్టోబర్ 16న వ్యాసరచన, అక్టోబర్ 18న డిబేట్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజులు తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	26
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): విద్యార్థులు అందరూ సిగరెట్లు, మందు, గంజాయి వాటికి దూరంగా ఉండాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ బాల భవన్ సంస్థ సైకాలజిస్ట్ అనూష అన్నారు. మంగళవారం ఏలూరులో వైఎస్సార్ నగర్‌లో ప్రాథమిక, హైస్కూల్, కాలేజీల్లో చదివే విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనూష మాట్లాడుతూ చదువులో వెనకబాటుతనం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఏపీ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్ మాట్లాడుతూ నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతాల్లో, అనేక స్వచ్ఛంద సంస్థలు వచ్చి విద్య, వైద్యం గురించి అవగాహన కల్పించడం ఉచిత సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. డంపింగ్ యార్డుల్లో చెత్తాచెదారం వేరుకుని వారిజీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్ కుమారి, పార్వతి, ధనలక్ష్మి, దయావతి, సంస్థ ఇన్‌చార్జి ఆంజనేయులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అథ్లెటిక్స్ పోటీల్లో తమ పాఠశాల క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించారని స్థానిక కేంబ్రిడ్జ్ స్కూల్ చైర్మన్ ఇళ్ల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఏలూరు వన్‌టౌన్‌లోని పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. సోమవారం ఏఎస్ఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ జిల్లా జట్టు ఎంపికకు నిర్వహించిన పోటీల్లో అండర్-16 విభాగంలో 600 మీటర్ల రన్నింగ్ బాలికల విభాగంలో పదో తరగతి విద్యార్థిని పి.హర్లినా ద్వితీయ, 80 మీటర్ల హర్డిల్స్‌లో పదో తరగతి విద్యార్థిని ఎస్ భావన ద్వితీయ, జావెలిన్ త్రోలో పి.హర్లినా తృతీయ, పరుగు, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్‌లో 9వ తరగతి విద్యార్థి బి.ధనహర్ష తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. ప్రిన్సిపల్ నాగరాజు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల సత్తా

ఏలూరు రూరల్ : ఈ నెల 15న ఏలూరు అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో శ్రీసూర్య విద్యార్థులు సత్తా చాటారని స్కూల్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. లాంగ్‌జంప్, రన్నింగ్, హైజంప్ విభాగంలో పాల్గొన్న బాలబాలికలు ఎస్‌కే మొబీనా, ఎం డింపుల్ సాయి, పి.నాగఫణి, పి.జయచంద్ర, ఎస్‌కే ఆయుష్, ఎ.వివేక్, డి.సత్యమణికంఠ, టి.అక్షయ కుమార్‌తో పాటు ఎస్‌కే రిఫత్ సుల్తానా ప్రతిభ చాటారని వివరించారు. ప్రతిభ గల వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.